www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 11 జులై 2024 5


డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం కోటిపాటి అగ్రహారం ప్రాథమిక పాఠశాల్లో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ల పుస్తకాల కిట్లను వారు పంపిణీ చేశారు. ఎంపిపి మాట్లాడుతూ బాల్యం నుండి చదువులు సక్రమంగా కొనసాగితే పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సక్రమంగా రుచికరమైన భోజనం అందించాలన్నారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుంకర పేరయ్య నాయుడు, స్థానిక నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి, సర్పంచ్

చదువుకొనేదెలా?


- ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీ'జులుం'
- భారీగా పెంచి వసూలు చేస్తున్న యాజమాన్యాలు
- అధిక ధరలకు పుస్తకాలు,యూనిఫాం అమ్మకాలు
- గగ్గోలు పెడుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పిల్లలకు మెరుగైన విద్య కోసమో లేక ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్లనో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో చేరుస్తున్నారు. డబ్బున్న వారి మాటలెలా ఉన్నా మధ్యతరగతి వర్గాలు సైతం వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. వారి బలహీనతల్ని ఆసరాగా చేసుకుంటున్న ప్రయివేటు యాజమాన్యాలు భారీగా ఫీజులు దండుకుంటున్నాయి. ఈ ఫీజుల భారం భరించలేక బాబోయ్ అని గగ్గోలు పెడుతున్న పరిస్థితులు నెలకున్నాయి.

మాయ మాటలు చెప్పి...

తమ పాఠశాలల్లో చేర్పిం చండి..విద్యార్థికి ఉజ్వలమైన భవిష్యత్తును ఇస్తాం అంటూ ఆకర్షణీయమైన ప్రకటనలతో యాజమాన్యాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వలలో వేసుకుంటున్నాయి. ఆయా విద్యాసంస్థల ప్రతినిధులు పదే పదే విద్యార్థుల ఇళ్లకు తిరుగుతూ తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి విద్యా వ్యాపారం అనే ముగ్గులోకి దింపుతున్నారు. పుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, చివరికి బూట్లు కూడా తామే తక్కువ ధరకు అందిస్తామంటూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. మే వారాంతం నుంచే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ హడావుడి చేశాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,800 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. ఏటా 3.50 లక్షల మంది వరకూ విద్యార్థులు వీటిలో విద్యను అభ్యసిస్తున్నారు.



డొనేషన్ల పేరుతో...

డొనేషన్ పేరిట రూ.10 వేలు మొదలుకుని రూ.50 వేలు వరకూ వసూలు చేస్తున్నారు. సంవత్సరం పొడవునా ఫీజుల రూపంలో ప్రయివేటు స్కూళ్లు రూ.30 వేల నుంచి రూ.60 వేలు, కార్పొరేట్ స్కూళ్లు రూ.లక్షల్లో దోచుకుంటున్నాయి. యూనిఫాం, బూట్లు, టై, పుస్తకాల పేరుతోనూ దోపిడీ సాగుతోంది. పుస్తకాలకు రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారు.

నియంత్రణ ఏది..?

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు తమకు నచ్చిన రీతిలో ఫీజులను వసూలు చేస్తున్నా నియంత్రణ లేకపోవడంతో తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నాయి. మరోవైపు నిబంధనలను ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తుంగలోకి తొక్కుతున్నాయి. పదో తరగతి, ఇంటర్ చదివిన వారితో తక్కువ జీతాలు ఇచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బిఇడి, డిఎడ్ చేసి శిక్షణ పొందిన వారితో విద్యనందించాలనే నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులు చదువుల్లో వెనుకబడి పోతున్నారు. వేలకు వేలు ఫీజులు కట్టినా ఫలితం మాత్రం రావడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నాయి. రెట్టింపు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం రూ.10 వేలు నుంచి రూ.20 వేలు పెంచి వసూలు చేస్తున్నారు. డొనేషన్ల పేరుతో తల్లిదండ్రులను దోచేస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరంలో ఉన్న కొన్ని యాజమాన్యాలు ఇష్టారాజ్యానికి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.

మానసిక వేదనకు గురవుతున్న విద్యార్థులు



ప్రయివేటు పాఠశాలలు పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తు న్నారని దీంతో విద్యార్థులు మానసికంగా వేదనకు గురవుతున్నారు.కొన్ని పాఠశాలలో కేవలం పుస్త కాలకే మూడో తరగతిచ నాలుగో తరగతి విద్యా ర్థులు వద్ద నుంచి రూ.5వేలు వసూలు చేయడం దారుణం. **-కె.శంకర్, అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్, ఎస్ఎఫ్ఐ**

ఎరువుల కొరత రాకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ఎరువుల కొరతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో జలవనరులు వ్యవసాయం, ఉద్యాన శాఖల పనితీరుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందించి అధిక దిగుబడులు సాధించే దిశగా ప్రోత్సాహం చాలన్నారు. ఎక్కడ ఎటువంటి ఎరువుల కొరత రాకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు తరచూగా వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగునీటి యాజమాన్యం సస్యరక్షణ పద్ధతులపై పొలంబడి కార్యక్రమాల ద్వారా తోడ్పాటును అందించాలని ఆదేశించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి పంట కోత దశలో ముంపు బారిన పడకుండా ముంపు ప్రభావిత ప్రాంతాలను మ్యాపింగ్ చేస్తూ ప్రభావిత ప్రాంతాలను గుర్తించాలన్నారు. ముంపు నీరు దిగువకు పారేలా పూడికతీతలు షట్టర్ రిపేర్లు పటిష్టంగా చేపట్టాలని సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. పంట కాల పరిమితి తక్కువగా ఉండే ఈ ప్రాంతానికి అనువైన వరి వంగడాలను ఎంపిక చేస్తూ తుపాన్ల బెడద నుండి పంటలను కాపా డుకునే విధంగా మరియు అధిక దిగుబ డులు సాధించేలా చర్యలు చేపట్టి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చా లన్నారు. వెదజల్లే విధానం పట్ల కూడా రైతాంగానికి అవగాహన పెంపొందిస్తూ ఎకరాకు రూ.6 వేల వరకు పెట్టుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా పంట కాలపరిమితిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంటలకు ఏ ఏ దశల్లో సాగునీరు పుష్కలంగా అందించాలో ఆ దిశగా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగును సమీక్షించారు. స్థానికంగా లభించే కొబ్బరిలో నాణ్యమైన నూనె, కొబ్బరి ఉత్పాదకత ఎక్కువగా ఉంటుందని కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలను నాబార్డు, సూక్ష్మ చిన్న తరహా వంటి పథకాల ద్వారా పరిశ్రమలు నెలకొల్పుతూ రైతాంగానికి మంచి ఆదాయం సమకూరేందుకు అన్ని విధాల ప్రోత్సాహం చాలని ఆదేశించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి కింద కొబ్బరి పంట ద్వారా జిల్లా ఎంపికైందన్నారు. కార్యక్రమంలో జిల్లా జెసి ఎస్.నుపూర్ జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జిల్లా ఉద్యాన అధికారి బి.వి.రమణ, జల వనరుల శాఖ డిఇ శ్రీనివాసరావు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ అమలుపై సమీక్ష

స్థానిక కలెక్టరేట్లో ఉపాధి హామీ చట్టం అమలు తీరుపై అధికారులతో బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సగటున ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పనకై పాటుపడాలన్నారు. అధికారులతో పలు అంశాలపై మాట్లాడారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్.మధుసూదన్ ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్కు సత్కారం

అమలాపురం రూరల్: ఇటీవల జిల్లా నూతన కలెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఆర్ మహేష్ కుమార్ ను శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కల్టెర్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన చేనేత గ్రామం అయిన బండారులంక ను సందర్శించాలని కలెక్టర్ ను ఆహ్వానం కోరగా తప్పకుండా వస్తాను అని హామీ ఇచ్చారు. అలాగే బండారులంక చేనేత కార్మికులు నేసిన చేనేత వస్త్రం బహూకరించారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకారం : ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి-ఆలమూరు

స్థానిక శివారు కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. బుధవారం ఆలమూరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.నరసింహ స్వామి, కళాశాల అధ్యాపకులు వాడపాలెంలో ఆయన్ని కలిసి కళాశాల స్థితిగతులను వివరించారు. ఆలమూరు పరిసర ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని, అందుకు అందరూ కలిసి కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు.



ఎంఎల్ఎ బండారును కలిసిన కళాశాల ప్రిన్సిపల్ తదితరులు

హెల్మెట్ వినియోగంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-రామచంద్రపురం

లోక్ అదాలత్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వికాస్ డిగ్రీ కళాశాలలో హెల్మెట్ ధరించడం వల్ల లాభాలు అనే అంశంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు మైనార్టీ తీరేవరకు మోటారు సైకిళ్ళు నడపరాదన్నారు శిక్షణ పొంది ఆ తరువాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి మురళీమోహన వెంకటరమణ, ఉపాధ్యక్షులు పి.సత్యనారాయణ, లోక్ అదాలత్ సిబ్బంది కె.విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు ఆర్ఆర్కె పి.జానకి, పోలీస్ సిబ్బంది కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి -మామిడికుదురు

పారిశుధ్య చర్యల్లో భాగంగా పాశర్లపూడి సత్రం తోటలో బుధవారం పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. స్థానికు లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి కెవి.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కెవి. సూర్యనారాయణ పంచాయత సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్స్ డే



అల్లవరంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి

ప్రజాశక్తి-యంత్రాంగం

సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్స్ డే దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం జిల్లాలో డిమాండ్స్డే నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అల్లవరం: కార్మికులందరికీ కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని, బిజెపి ప్రభుత్వం కార్మికులను యాజమాన్యానికి బానిసగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆల్ ఇండియా పిలుపుమేరకు జిల్లా అల్లవరం మండలంలో తహశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా బుధవారం జరిగింది. ఈ ధర్నాని ఉద్దేశించి సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వే లు చెల్లించాలని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని ఆ సంఘటన కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కంటిలిజెంట్ వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పిఎఫ్, ఇఎస్ఐ మంచి చట్టాలు అమలు చేయాలని విఒఎలకు కాలపరిమిత సర్కులర్ రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్స్కి పని భారం తగ్గించాలని యాపల పేరుతో స్కీం వర్కర్లకు పనిబారం పెరిగిందని యాపులను తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా యానిమేటర్స్ సంఘం నుండి సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్యామల, అంగన్వాడీ వర్కర్స్ అలాగే స్కూలు కంటెలెజెంట్ వర్కర్ల జిల్లా కార్యదర్శి కుసుమ సరళ తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** న్యాయమైన కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేయాలనీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. కార్మిక వర్గ నాయకత్వంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న డిమాండ్స్ డే సందర్భంగా అమలాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి వెంకటేశ్వరావు మాట్లాడారు. న్యాయమైన కార్మిక డిమాండ్ల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో నూతన ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి తనపాత విధానాలనే కొనసాగించటానికి నిశ్చయించుకుందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కార్మికులు స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమూల్య, రుక్మిణి, దైవకప, సత్యవాణి,విజయ, ప్రమీల, సత్య వతి, దుర్గాదేవి, ధనలక్ష్మి, సంగీత, తదితరులు పాల్గొన్నారు. **రాజోలు:** సిఐటియూ ఆధ్వర్యంలో రాజోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ, ఆశ వర్కర్స్, మధ్యాహ్న భోజన పథక సిబ్బంది డిమాండ్స్డే నిర్వహించారు. తొలుత ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యవేణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ రాజోలు ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు రామలక్ష్మి, సుచిత్ర, శ్రీదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మేరీ, మధ్యాహ్న బోజన పథకం యూనియన్ లీడర్ వనిత తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం**: డిమాండ్స్ డే ని రామచంద్రపురం పట్టణంలో నిర్వహించారు. పాత బస్టాండ్ నుండి తహశీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, మండల సిఐటియు కన్వీనర్ ఎం దుర్గమ్మ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ వెంకటేశ్వరరావు కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సూర్యకుమారి, జహీరా, దుర్గా, విజయలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, ఆశ నాయకురాలు దేవి, హేమ, ఆశ వర్కర్స్, మిడ్డే మీల్స్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. కె.గంగవరం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో అంగన్వాడీలు వినతి పత్రం అందజేశారు. **ముమ్మిడివరం:** నగర పంచాయతీ పరిధిలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం అంగన్ వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం,డ్వాక్రా, మెప్మా మరియు మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహ శీల్దార్ శ్రీను నాయక్ కు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జి.బేబీ, జి.అనంత లక్ష్మి, టి.శ్రీదేవి, ఎవి.రమణమ్మ, ఇందిరా గంగాభవాని సిఐటియు మండల కార్యదర్శి నిమ్మకాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంగనవాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.బేబీ, అనంతలక్ష్మి, వి.మంగాదేవి, ఎం జానకిదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ రాజరాజేశ్వరికి అందజేశారు. **మామిడికుదురు:** అంగన్ వాడీలతో పాటు, మిడ్డే మీల్స్ కార్మికులు ఆశ వర్కర్లుతమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మామిడి కుదురు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మెరికమ్మకు వినతి పత్రం అందజేశారు. **కొత్తపేట:** సిఐటియు ఆధ్వర్యంలో న్యాయపరమైన డిమాండ్లను తీర్చాలంటూ కొత్తపేట తహశీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.భాస్కరరావు మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ ఎలిషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఆశాలు, మిడ్డే మీల్స్ నిర్వాహకుల తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** కోర్కెలు దినాన్ని సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ ఆఫీసు వద్ద కార్మికులు ధర్నా చేసి అనంతరం డిటి ఝాన్సీకి వినతిపత్రం సమర్పించారు. సిఐటియూ నాయకులు విత్తనాల రాంబాబు, వి.మోహన్రావు, ఎస్.మహేశ్వరిలు మాట్లాడారు. కార్యక్రమంలో బి.పార్వతి, కె.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సిఐటియు నాయకురాలు పి. బేబి గంగారత్నం ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆందోళనలో సిఐటియు నాయకురాలు జె.భద్రకాళి, మేకల బాలవేణి, పరిపూర్ణ, సీత, బేబీ, సరోజిని, నిమ్మకాయల రాధా లక్ష్మి, సలాది ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట:** సిఐటియు ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంబాజీపేట తహశీల్దార్కార్యాలయం ఎదుట వివిధ కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారెం వెంకటేశ్వరరావు, బి.ఎస్తేరు రాణి, సుజాత, లలితా కుమారి, దుర్గా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న కారెం వెంకటేశ్వరరావు



రామచంద్రపురంలో కార్మికుల డిమాండ్స్ డే




ముమ్మిడివరంలో కార్మికుల డిమాండ్స్ డే



కొత్తపేటలో తహశీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కార్టూ'నిజం'



బ్యాడ్మింటన్లో అభిషేక్కు బంగారు పతకాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణానికి చెందిన మోడరన్ విద్యార్థి అభిషేక్ బ్యాడ్మింటన్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించారని మోడరన్ అధినేత లయన్ జివి.రావు బుధవారం తెలిపారు. కొత్తపల్లి సత్య నారాయణ మెమోరియల్ తరపున రాజమహేంద్రవరంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న టెన్త్ విద్యార్థి బోను అభిషేక్ మూడు గోల్డ్ మెడల్స్ సాధించారని రావు వివరించారు. అండర్-17 లో సింగిల్ విన్నర్, అండర్ -17 డబుల్స్ విన్నర్, అలాగే అండర్ -19 లో కూడా డబుల్స్ విన్నర్ గా నిలిచాడన్నారు. బుధవారం లయన్ జి.వి. రావు, హైస్కూల్ హెడ్ మాస్టర్ ఎం. చిట్టిబాబు, అభిషేక్ ని అభినందించారు. అభిషేక్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, మోడరన్ విద్యాసంస్థల సహకారం తన విజయంలో కీలక భూమిక పోషిస్తున్నాయని అన్నాడు. కార్యక్రమంలో మోడరన్ స్టాఫ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



విద్యార్థి అభిషేక్తో లయన్ జివి.రావు

సమావేశాలకు సమగ్ర సమాచారంతో అధికారులు హాజరవ్వాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

మండల పరిషత్ సమావేశాలకు అధికారులంతా సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం అయినవిల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మాట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో వివిధ ప్రభుత్వ శాఖల వివరాలపై ఎంఎల్ఎ ఆరా తీశారు. సభ్యులు మండలం లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. తొలుత ఎంఎల్ఎగా ఎన్నికై తొలిసారిగా సమావేశానికి హాజరైన ఎంఎల్ఎకు ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపిడిఒ టిఎస్.మూర్తి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు కూడా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

జీతాలు చెలించాలని వినతి

ప్రజాశక్తి-యంత్రాంగం

కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు బకాయిలు చెల్లించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష జెఎసి పిలుపు మేరకు బుధవాం ధర్నా చేశారు.

రామచంద్రపురం : సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న సిఆర్పి లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఇక్కట్ల గురవుతున్నామని కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ వెంకన్న బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంఇఒ మీనపూడి శ్రీనివాసు, ఎంఇఒ-2 వి. నాగేశ్వరికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. **ఐ.పోలవరం:** రాష్ట్ర సమగ్ర శిక్ష జెఎసి పిలుపు మేరకు ఐ.పోలవరం మండలంలో ఈ ప్రాజెక్ట్ ద్వారా మండల విద్యాశాఖ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పనిచేయుచున్న వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ వి.వెంకట రమణ, ఆఫీస్ అసిస్టెంట్,పి.శ్రీహరి విష్ణు వర్మ, పార్ట్ టైం ఇంస్ట్రక్టర్స్, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు. **మామిడికుదురు:** ఎపి రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మండలంలో భోజన విరామ సమయంలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు ప్లకార్డులతో బుధవారం మామిడికుదురు ఎంఆర్సి కార్యాలయంతో పాటు ఈదరాడ హైస్కూల్ వద్ద నిరసన తెలిపారు. మే, జూన్ నెలల్లో పెండింగ్ జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో సమగ్ర శిక్ష సిబ్బంది డేటా ఎంట్రీ ఆపరేటర్ , సిఆర్ఎంటిలు, మెసేంజర్ పాల్గొన్నారు



ఐ.పోలవరంలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన

ఐదేళ్లలో కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ను పూర్తి చేస్తాం : ఎంపీ హరీష్

ప్రజాశక్తి-అమలాపురం

కోనసీమ రైల్వే ప్రాజెక్టు పనులు రానున్న ఐదేళ్ల లోపు పూర్తవుతాయని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు.ఇటీవల విప్ గా నియామకం పొందిన పార్లమెంటు సభ్యులు హరిష్ మాధుర్ ను మంగళవారం రాత్రి ఆయన క్యాంప్ ఆఫీస్ లో కోనసీమ జెఎసి కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఆశయం మేరకు కోటిపల్లి - నర్సాపురం రైల్వేలైన్ పూర్తి చేయించడమే తన లక్ష్యం అని అన్నారు. జెఎసి కన్వీనర్ బండారు రామమోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీ లో కో కన్వీనర్లు ఇళ్ల భక్తవత్సలం, కరాటం ప్రవీణ్, మంత్రప్రగడ వేణుగోపాల్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చెముడులంక నుండి మడికి వరకు జాతీయ రహదారికి సమాంతరంగా సర్వీస్ రోడ్డు నిర్మించాలని బహుజన్ సమాజ్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం దివాన్ చెరువు వద్ద గల జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయంలో పిడి డి.సురేందర్ నాథ్ కు ఆయన ఆధ్వర్యంలో పార్టీ నేతలతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సెక్రటరీ నెల్లి మహేష్, కొత్తపేట మండల ఉపాధ్యక్షుడు విఘ్నేశ్వరపు మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - చాగల్లు

భార్యాభర్తల మధ్య వివాదాల నేపథ్యంలో చాగల్లుకు చెందిన దొంగ వెంకటరామకృష్ణ(37) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో బుధవారంజరిగింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన దొంగ వెంకటరామకృష్ణకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య విబేధాల నేపథ్యంలో రెండు ఏళ్ల నుంచి ఒంటరిగా జీవిస్తున్నాడు. దీంతో మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం తన ఇంటిలో స్లాబ్‌కి ఉన్న హుక్కుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి బుల్లయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.నాగరాజు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం పొట్టిలంకలో ఈ నెల 8న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడని కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో గుర్తుతెలియని సుమారు 60 ఏళ్ళ వయసు గల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని 108లో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్టు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు కడియం పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కోరుమిల్లి ఏటి గట్టు వద్ద మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అంగర ఎస్ ఐ అందే పరదేశి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు కోరుమిల్లి లో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంకు చెందిన ఈపీ ధర్మసాయి మద్యం తరలిస్తున్నాడని గుర్తించి అతనిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రూ.3648 విలువ చేసే మద్యం బాటిల్స్‌ను, ఒక ద్విచక్ర వాహనాన్ని ,స్వాధీన పరచుకున్నట్లు ఎస్ ఐ పరదేశి తెలిపారు

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పంచాయతీలోని బాబాజీవన్ నగర్‌లో డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజలతో కలిసి నిర్వహించిన ర్యాలీలో పరిశుభ్రతను పాటించండి, స్టాప్ డయేరియా అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఎఎస్ ఎం.రోజా, ఆసుపత్రి సిబ్బంది ప్రసాద్, ఎం.రత్నం, పూజిత, శుభ పాల్గొన్నారు.

కట్టమూరులో 'పొలంబడి'

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన కట్టమూరులో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ కె.సంజయ్ కుమార్ పాల్గొని రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడి 14 వారాలు జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన రైతులందరూ 14 వారాలు పొలం బడికి హాజరు కావాలన్నారు. పొడి విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు మేడిది శ్రీనివాస్, అడపా గంగాధరం, మాదిరెడ్డి రామకృష్ణ, పి సుబ్బారావు, వ్యవసాయ సహాయకులు విజయదుర్గ, అమృత, జ్యోతి పాల్గొన్నారు.

డ్రైవింగ్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ద్విచక్ర వాహనాల నడిపే క్రమంలో పూర్తి అవగాహన అవసరమని ప్రత్తిపాడు కోర్ట్ ప్యానల్ న్యాయవాది బుగతా శివ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రవరం విజ్ఞాన జ్యోతి కళాశాల ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్‌పై కనీస అవగాహన లేకుండా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్ లేని ప్రయాణాలతో ఎందరో యువకుల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ సతీష్‌బాబు మాట్లాడుతూ లైసెన్స్, హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడిపితే వారితోపాటు, వారి తల్లీదండ్రులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయవాది అవసరాల దేవి నూతన చట్టాలు, శిక్షలను వివరించారు.

రేబిస్ మృతిపై అనుమానాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పంచాయతీ జల్లా వారి పేటకు చెందిన మందనక్క తనుకురాజు (60) రేబిస్ వ్యాధిదో ఈ నెల 6న మృతి చెందాడు. ఉపాధి కూలీగా పని చేసే తనుకు రాజు జూన్ 3న కుక్క కాటుకు గురయ్యాడు. అదేరోజు తాళ్లరేవు సిహెచ్‌సిలో యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నాడు. పూర్తి స్థాయిలో నాలుగు డోసులు తీసుకున్నాడు. అయితే తరువాత ఆరోగ్యం క్షీణించడంతో కాకినాడ తరలించారు. పరిస్థితి విషమించి జూలై 6న మృతి చెందాడు. యాంటీ రాబిస్ వ్యాక్సిన్ తీసుకున్నా ఆయన మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వ్యాక్సిన్ ఇచ్చే సమయంలో తగిన మోతాదులో డోసు ఇవ్వాల్సివుందని వైద్యులు చెబుతున్నారు. మృతి చెందిన వ్యక్తికి సరిపడినంత మోతాదు ఇవ్వలేదా? ఇచ్చి ఉంటే మరణం ఎందుకు సంభవించింది? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక సిహెచ్‌సి సూపరింటెండెంట్ శిరీషను వివరణ కోరగా మరణం ఏ విధంగా సంభవించిందో ఎలా చెప్పగలం అని ప్రశ్నించడం గమనార్హం. ఈ మరణంపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

13న పెద్దాపురం మండల పరిషత్ సమావేశం

పెద్దాపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 13న జరుగుతుందని ఎంపిడిఒ ఉషారాణి ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశం ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన జరుగుతుందన్నారు. మండల పరిధిలోని 23 గ్రామాలకు సంబంధించిన సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రభుతేజను ఎవరు గాయ పరచలేదు : సిఐ

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని రేచర్ల పేటకు చెందిన కుంచె ప్రభుతేజాను ఎవరు గాయపరచలేదని సిఐ నాగేశ్వర్ నాయక్ వెల్లడించారు. బుధవారం 2వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం సుమారు 11.45 గంటల సమయంలో రేచర్లపేటకు చెందిన కుంచే ప్రభుతేజ తీవ్రగాయాలతో కోర్టు ఆవరణలోకి వచ్చి తన విరోధులు చాకుతో దాడి చేశారని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లితే పట్టించుకోలేదని అందుకే కోర్టుకి వచ్చినట్లు చెప్పి వీడియోలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందన్నారు. దీనిపై పోలీసులు ప్రాథమిక విచారణ చేయగా అతను చెప్పిన ప్రదేశంలో ఎటువంటి గొడవలు జరగలేదన్నారు. ఇదే వ్యక్తి 2021లో ఇలాగే తనకు తాను గాయాలు చేసుకుని వాటిని తీవ్ర రక్తగాయాలుగా హల్చల్ చేసి హాస్పిటల్‌లో జాయిన్ అయ్యాడని, దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అది వాస్తవం కాదని కేసును రిఫర్ చేయడం జరిగిందన్నారు. అలాగే మరో కేసులో తన పూరిపాకను తానే కాల్చుకుని స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అదీ వాస్తవం కాదని తేలిందని చెప్పారు. మరోసారి కలెక్టరేట్ ముందు కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడని, దానిపైనా కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. బుధ వారం ఒక కేసులో ముద్దాయిగా ఉన్న ప్రభుతేజ కోర్టులో వాయిదాకు హాజరుకావాల్సివుందని, ఈ నేపథ్యంలోనే అతగాడు గాయాలతో కోర్టుకు తనపై దాడి జరిగినట్లు చెప్పాడని, దానిపై విచారించగా ఎటువంటి సంఘటన జరలేదని తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఇతనికి గాయాలు ఎలా అయ్యాయి అనేది పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పొత్తు ధర్మాన్ని పాటించాలంటూ నిరసన

ప్రజాశక్తి - గొల్లప్రోలు (పిఠాపురం)

అపర్ణాదేవి ఆలయ నిర్వహణ బాధ్యతలలో పొత్తు ధర్మాన్ని పాటించాలని టిడిపి శ్రేణులు బుధవారం నిరసన చేపట్టారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణదేవి గుడి నిర్వహణ బాధ్యతలు విషయంలో గతంలో టిడిపి,జనసేన మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం విధితమే. అధికారుల చొరవతో అప్పటికి గొడవ సద్దుమణిగింది. బుధవారం గుడికి సంబంధించిన తాళాలు జనసేన నాయకుల చేతుల్లోకి చేరడంతో ఆలయ బాధ్యతల వివాదం తిరిగి తెరమీదకు వచ్చింది. దీంతో గ్రామ టిడిపి శ్రేణులు ఆలయ సమీపంలో టెంట్ వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు జి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆలయం నిర్మణం వెనుక గ్రామస్తులందరి కృషి ఉందన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో కేవలం జనసేన పార్టీ నాయకులకు తాళాలు అప్పగించడం సబబు కాదన్నారు. గుడి నిర్వహణ బాధ్యతలలో టిడిపి శ్రేణులను కూడా భాగస్వాములు చేయాలని కోరారు.

ఆధునిక సాంకేతిక సాగుతో ఆదాయం

ప్రజాశక్తి - కాజులూరు

ఆధునిక సాంకేతిక పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఆదాయం పెరగడంతోపాటు, ఖర్చు తగ్గుతుందని జిల్లా వ్యవసాయ సంచాలకులు జె.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం గొల్లపాలెం రైతు సేవా కేంద్రంలో కాజులూరు, తాళ్లరేవు మండలాల రైతు సేవ కేంద్రం సిబ్బందికి పొలంబడిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాల్లో 2.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడం జరుగుతుందన్నారు. రైతులు, కౌలు రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించుకున్నట్లయితే ఖర్చులు తగ్గి అదనపు ఆదాయం రావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికీ పలువురు రైతులు ఇష్టానుసారంగా మందులను వినియోగిస్తున్నారని, దీనివల్ల ఫలితం ఉండదన్నారు. రైతు సేవ కేంద్రంలో శిక్షణ పొందిన సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు కె.బాబురావు, అశోక్ , ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్స్ డే

ప్రజాశక్తి - యానాం



స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం డిమాండ్స్ డే సందర్భంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను, భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. యానాం పరిధిలో ఉన్న ఇసుక ర్యాంపులను తెరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రేషన్ షాప్‌ల ద్వారా బియ్యం, నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలన్నారు. అనంతరం ఆర్ఎఒ మునిస్వామికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ కె.సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాస్, మధు, సబ్బతి రాంబాబు, తిరుకోటి శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొమ్ముపురుగు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కనకాలపేట కవల కోటేశ్వరరావు కొబ్బరి తోటలో రైతులకు కొబ్బరిలో కొమ్ము పురుగు నివారణపై డిప్యూటీ డైరెక్టర్ శివ సుబ్రహ్మణియన్ రైతులకు బుధవారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం కొమ్ము పురుగు నివారణ, ఫిరమోన్ ఎరలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిక్కాల జోగిరాజు, ఫీల్డ్ మెన్ కెవి.సుబ్బారావు, ఐకె.ఖాన్, విజయకుమార్, చినబాబు పాల్గొన్నారు.

గోదారిలా... రహదారి

ప్రజాశక్తి - తాళ్లరేవు



మండలంలోని కోరంగి పంచాయతీ సీతారామపురం మెయిన్ రోడ్డు కొద్దిపాటి వర్షానికే గోదారిని తలపిస్తుంది. ఈ ప్రాంతంలో మెయిన్‌రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు బయటకు పోయే అవకాశం లేకపోవడంతో ఆ రోడ్డున వెళ్లే ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మెయిన్ రోడ్డు ఇరువైపుల డ్రెయిన్ నిరించాలనే ప్రతిపాదనలు ఉన్నా ఆచరణకు నోచుకోవడం లేదు. గ్రామానికి ఎంతో మంది సర్పంచులు మారినా, గ్రామంలో మండల స్థాయి నాయకులు ఉన్నా ఫలితం ఉండటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి రోడ్డుపై నిలిచిపోతున్న నీరు అక్కడే నిల్వ అయిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని ప్రజలు చెబుతున్నారు. తక్షణమే రోడ్డుపై నిలిచిపోతున్న నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే మేలు

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రతీ ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటేనే మేలు జరుగుతాదని మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. బుధవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం అమ్మాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రయివేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. తద్వారానే ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుందని అన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, టిడిపి శ్రేణులు పాల్గొన్నాయి.

ఆదిత్యలో రోడ్డు లైన్ సేఫ్టీపై సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో పెద్దాపురం మండల న్యాయసేవాధికార సంస్థ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోడ్ లైన్స్ సేఫ్టీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ సదస్సులో జగ్గంపేట సిఐ లక్ష్మణరావు మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని అన్నారు. రోడ్ ప్రయాణాలలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ బి.సూర్యనారాయణమూర్తి, న్యాయవాదులు ఎ.ప్రభుజీ, ఎం.రాంబాబు, సత్యవతి, అప్పలకొండ, ఆదిత్య పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతరకు గురువారం అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు క్యూలెన్లు, పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌లైన్ క్లోరినేషన్ ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట, రావువారి చంద్రంపాలెం గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానంలో తాగునీటి సరఫరాను ప్రారంభించామని ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణసత్యరెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు. గతంలో తాగునీటిని ట్యాంకుల్లో నింపి క్లోరినేషన్ చేసేవారమన్నారు. ప్రస్తు తం ఆ విధానానికి స్వస్తి పలికి నూతనంగా పైప్ లైన్‌లో క్లోరినేషన్ టాబ్లెట్ వేస్తున్నామన్నారు. అచ్చంపేటలో నిర్వహించిన ఈ విధానాన్ని సర్పంచ్ వి.శ్రీరామకృష్ణ శ్రీనివాసనాగభూషణరావు ప్రారంభించారని తెలిపారు.

కాపు సామాజికవర్గం సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

గత ఐదేళ్ల పాలనలో కాపు సామాజికవర్గానికి ఎటువంటి న్యాయం జరగలేదని, కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను ఐక్య కాపునాడు నాయకులు కోరారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎను వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి పాలనలో కాపు సామాజికవర్గానికి న్యాయం చేయాలని, అందుకు కృసి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐక్య కాపునాడు అధ్యక్షులు వాదా ప్రసాదరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గాదంశెట్టి కొండలరావు, ఉపాధ్యక్షులు తుమ్మల శ్రీరామమూర్తి, అడపా ప్రకాష్‌నాయుడు, గండి కిషోర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఒపితో అవస్థలు

- వెంటాడుతున్న సర్వర్ సమస్య
- క్యూలైన్లోనే గంటల తరబడి నిరీక్షణ
- రోగులకు తప్పని ఇబ్బందులు



ఒపి వద్ద కిక్కిరిసిన రోగులు, వారి సహాయకులు

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రభుత్వాసుపత్రుల్లో అమలౌతున్న ఆన్‌లైన్ ఒపితో రోగులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర వైద్య సేవలను పక్కన పెడితే రోజువారీ వివిధ రోగాలతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఈ విధానంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. అసలే నీరసంతో ఆసుపత్రికి వస్తున్న రోగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఒపి చీటీలను అందుకోవాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. గంటల తరబడి క్యూలైన్లలో ఉండిన తరువాత సర్వర్‌లో సమస్య తలెత్తితే ఒపి చీటీ కోసం నిరీక్షణ తప్పడం లేదు.

రౌతులపూడి ప్రభుత్వాసుపత్రికి నిత్యం వందలాదిమంది రోగులు వస్తుంటారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు చెందిన రోగులతోపాటు, శంఖవరం, కోటనందూరు మండలాల నుంచి సైతం ఇక్కడి సిహెచ్‌సికి వస్తుంటారు. ప్రతీ రోజు సిహెచ్‌సికి 300 నుంచి 500 మంది వరకూ రోగులు వస్తుంటారు. ఎంతమంది రోగులు వచ్చినా ఒకే కౌంటర్ నుంచి ఆన్‌లైన్ ఒపి చీటీలను తీసుకోవాల్సివస్తుంది. ఉదయాన్నే ఆసుపత్రికి చేరుకుని క్యూలైన్లలో ఉన్న రోగులు గంటల తరబడి నిల్చుంటున్నారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల్లో అత్యధికం పేద ప్రజలకు చెందిన వారే అధికంగా ఉంటారు. ఒపి చీటీకి వచ్చిన వారు తప్పనిసరిగా సెల్‌ఫోన్ తీసుకురావాలనే నిబంధన సైతం రోగులను ఇబ్బంది పెడుతోంది. సెల్ ఫోన్ లేకుండా వచ్చిన రోగులు ఇతరులను బ్రతిమాలుకోవాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. తీరా వారి సెల్‌ఫోన్ నెంబర్ చెప్పిన తరువాత ఒటిపి వచ్చే సమయంలో ఆన్‌లైన్ నెట్‌వర్క్ సమస్యతో సర్వర్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఆ రోగులు పడుతున్న బాధ వర్ణనాతీతం. ఇదిలావుంటే, గంటల తరబడి క్యూలైన్లలో ఉండి ఒపి చీటీని తీసుకుని వైద్యుల వద్దకు వెళ్లిన రోగులకు అవసరమైన మందులను ఆ చీటీలపై రాస్తున్నారు. వైద్యులు రాసి ఇచ్చిన చీటీని మందులు ఇచ్చిన తరువాత ఆ చీటీని వారి వద్దే ఉండిపోతుంది. దీంతో తిరిగి ఆసుపత్రికి రావాల్సివస్తే మళ్లీ ఒపి చీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్ ఒపి చీటీల వ్యవహారంలో జరుగతున్న ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి గతంలో అమలు చేసిన విధానాన్ని పునరుద్ధరించాలని రోగులు కోరుతున్నారు.

50 పడకలకు పెంపుదల చేయాలి

రోజు రోజుకీ పెరుగుతున్న ఇన్‌పేషంట్ల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సీజనల్ వ్యాధులతో వివిధ గ్రామాల నుంచి వైద్య సేవలు నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. దీంతో వైద్య సేవలు పొందేందుకు అవసరమైన పడకలు ఆస్పత్రిలో లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. రోగుల బంధువులు విశ్రాంతి తీసుకునే ప్రదేశాల్లో కూడా రోగులకు వైద్య సేవలు అందించవలసిన దుస్థితి ఇక్కడ నెలకుంది. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రౌతులపూడి ప్రభుత్వాసుపత్రినీ 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతోపాటు, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆన్‌లైన్ ఒపిని రద్దు చేయాలి

మండల కేంద్రమైన రౌతులపూడి పిహెచ్‌సిలో వైద్య సేవలు పొందెందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కో సమయంలో సెల్‌ఫోన్ లేకపోవడంతో ఆన్‌లైన్ ఒపి చీటీ అందడం లేదు. దీంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. తక్షణమే ఆన్‌లైన్ ఒపి చీటీ విధానాన్ని రద్దు చేయాలి.

గింజల లోవరాజు, రౌతులపూడి

ఉత్తమ యాజమాన్య పద్ధతులతో ఆక్వా అభివృద్ధి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆక్వా సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా లాభాలు సాధించవచ్చని తాళ్ళరేవు మత్స్యశాఖ ఎడి లావణ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎఫ్‌డిఒ గోపి అధ్యక్షతన జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనామి రొయ్య సాగులో హేచరీ వద్ద నుంచి రొయ్య సీడ్ కొనుగోలు, సీడ్ నాణ్యతపై పరీక్షలు నిర్వహించాలన్నారు. కాకినాడ ఎస్ఐఎఫ్‌టిలో రైతులకు ఉచితంగా అందిస్తున్న పలు రకాల పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రొయ్య సాగులో అత్యధికంగా కనిపించే ఇహెచ్‌సి వ్యాధికి మందు లేదని, ఆ వ్యాధి సోకిన రొయ్యలను వెంటనే పట్టుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు లేవనెత్తిన అనుమానాలను అధికారులు నివృత్తి చేశారు. ఆక్వా పంటలకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని రాయుడు గంగాధర్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు జి. గోపి, ఎస్.సుహాసిని, సహాయకులు పాల్గొన్నారు.

నవోదయలో ఉమర్ ఆలీషా విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని గెద్దనాపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ ఉమర్ ఆలీషా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి సింగం వెంకట్ అశ్వంత్ పెద్దాపురం జవహర్ నవోదయలో ఉత్తమ ప్రతిభను చాటుకున్నాడు. సెకండ్ మెరిట్ లిస్టులో సీటు సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ ఇనకోటి శ్రీగంగాధర్ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట్ అశ్వంత్‌ను కరస్పాండెంట్‌తోపాటు, ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తప్పనిసరిగా హెల్మెట్లు ధరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారంతా తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని డిఎస్‌పి లతాకుమారి సూచించారు. బుధవారం స్థానిక బ్యాంకు కాలనీలో రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణాల్లో హెల్మెట్లు ధరించకపోవడం వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని డిఎస్‌పి ప్రారంభించారు. మున్సిపల్ సెంటర్, దర్గా సెంటర్ మీదుగా కొత్తపేట గుర్రాల సెంటర్ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.సురేష్, న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, పోలీసు సిబ్బంది, ఆర్‌టిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.